

# నా పని అయిపోయింది

"కంగ్రాట్స్! మీరు తండ్రి కాబోతున్నారు". ఊర్మిళను పరీక్షించిన లేడీ డాక్టర్ మాటలు వింటూంటే అమృత గుళికలు చప్పరిస్తున్నట్టనిపించింది. ఊర్మిళ మొహం వెలిగిపోతోంది. అర్ధాంగి సిగ్గుల బుగ్గల్ని ఓరగా చూస్తూ "థాంక్యూ డాక్టర్!" అన్నాను. ఆఘమేఘాల మీద ఆటోలో ఇంటికొచ్చాము. మా అమ్మానాన్నకు, ఊర్మిళ వాళ్ల అమ్మానాన్నకు ఫోన్‌లో శుభవార్త చేరవేశాం. మాటలకందని వాళ్ల ఆనందాలు మమ్మల్ని ఆకాశానికెత్తేశాయి. సగటు మనిషి జీవితానికి మాతృత్వం లేదా పితృత్వం పైవాడిచ్చిన వరమని తెలుసుకానీ అది అంత కమ్మని అనుభూతినిస్తుందని అప్పుడే తెలిసొచ్చింది. మూగ మనసులు డ్యూయెట్ పాడుకుంటూంటే చల్‌మోహనరంగా అంటూ ఫస్ట్‌షో సినిమాకెళ్లాం. అట్నుంచటే హొటల్‌కెళ్లి భోంచేసి వచ్చాం. అదంతా నిన్నటి మురిపాల మూట. ఈ రోజు మాత్రం "ఊర్మిళా! ఊర్మిళా!!" నా పిలుపు ఉరుములా పరిణమించింది. డ్యూటీ ముగించుకుని బ్యూటీకోసం కొనుక్కొచ్చిన మల్లెపూల దండను మంచమ్మీద పడేసి డ్రెస్సు మార్చుకుంటున్నాను.

మెడలో వేదమంత్రాలు. నాద స్వరాల సాక్షిగా మూడుముళ్లేసి వెంట ఏడడుగులు నడిపించుకుని ఏడు నెలలు కాకముందే అర్ధాంగినలా పిలవడం భావ్యమా? కాదా? అన్న ఆలోచన అడుగున పడింది. గదిలోంచి బయటికొచ్చేశాను. "ఏమిటండీ! ఎన్నడూ లేనిది అంత గట్టిగా పిలిచారు?" చేతుల్లో టీకప్పుల ట్రేతో వచ్చిన ఊర్మిళ నన్ను కొత్తగా చూస్తూ సోఫాలో నా పక్కన కూచుంది. రోజూ రాయంచలా అడుగులేస్తూ వచ్చి ఎర్రని పెదాలకు సూర్యోదయం లాంటి చిరునవ్వు సింగారించుకుని వచ్చి టీ కప్పు అందించే సుందరాంగి మొహం మే మాసం ఎండకు వాడిపోయిన లేత వంకాయలాగైంది. లోపలినుండి పొంగుకొస్తున్న ఎసరును కుంగదీసుకుంటూ "అక్కడున్న ఆ ఫొటో కనబడ్డం

లేదు. ఏమైందీ?" నాజూకు చేతుల్లోంచి టీ కప్పు అందుకుంటూ సూటిగా కళ్లలోకి చూశాను. ఆ కళ్లల్లో ఉరుముకు జడుసుకున్న భయం తాలూకు ఛాయలు తచ్చాడుతున్నాయి. గతుక్కుమన్నాను. "ఏ ఫొటోనండీ?" కాటుక కళ్లపైన కనుబొమ్మలు ఎక్కుపెట్టిన ధనుస్సుల్లా పైకి లేచి ప్రశ్నార్థకాలైనాయి. వాటిమధ్య దోసగింజ ఆకారంలో ఎర్రని బొట్టు సంధించి వదలిన బాణంలాగుంది. "అదే... మన నెత్తిమీద గోడకున్న ఫొటో...!" కళ్లతో పైకి చూపించాను. మూతి తిప్పి ఊపిరి పీల్చుకుంది.

"ఓహ్! అదా! నేనే తీశాను." ట్రేను టీపాయ్‌మీదుంచి సర్దుక్కూచుంది. "ఇంట్లోకి వస్తూంటే ఎదురుగా అదే ఫొటో కనబడుతుంది. అదేమన్నా రవివర్మ గీసిన పెయింటింగ్ ఫొటోనా! అంద వికారం, తెరవెనక కూచోబెట్టి తీసిన ఫొటోలాగుంది. ఎదురుగా అలాంటిది ఎందుకండీ? మనిద్దరం షాపింకెళ్లి కళాత్మకంగా ఉన్న ఏదన్నా దేవునిది, రంగులబొమ్మ తెచ్చిపెడ్దాం. చల్లారిపోతుంది ముందు టీ కానీయండి." వెనక్కి ఒరగబోయి ఆగింది. "ఊర్మిళా! రోజూ నేనా ఫొటోకు మనసారా దండంబెట్టుకుంటున్నాను. అది అక్కడ కనబడకపోతే నాకు కంపరంగా ఉంటుంది. ఏమీ తోచదు" టీ చప్పరిస్తున్నాను.

"అలాగా! కానీ... ఆవిడ మీ అమ్మ కాదుగదా!" వెనకున్న నల్లని జడను ఎడమచేత్తో ముందుకు వేసుకుని కుడిచేత్తో టీ కప్పు అందుకుంది. నాలానే సోఫాకొరిగి కూచుని వేడి టీ కప్పును పెదాలకందించుకుంది. తెల్లని చీరకొంగు కప్పేసిన గుండెలమీది నల్లని జడ కొండమీదికి పాకుతున్న నల్లనాగులా వంకలు తిరిగింది. ఆ పొడగాటి జడ మల్లెదండకోసం మరులుగొన్నదని నాకు తెలుసు. కడుపులోని ఆవేశాన్ని కళ్లతో ఉపసంహరించుకున్నాను. పొగలు కక్కుతున్న చాయానందముతో ఉత్సాహం ఉరకలేసింది. "అయ్యగారినిలా ఎప్పుడూ చూడలేదు." మూతిని అందంగా మూడు ముళ్ళు తిప్పి ఖాళీ టీ కప్పులను టీపాయ్ మీది ట్రేలో ఉంచింది. "రోజూ ఆఫీసు నుండి రాగానే నా జడలో ఘుమఘుమలాడే పూలదండ తురిమేవారు..." చిన్నబుచ్చుకుంది. " రాగానే ఆ ఫొటో కనబడకపోతే... నా నవనాడులు కుంగిపోయినాయ రోజూ. "మీరెందుకు నమస్కరిస్తున్నారు?" టీ.వి. ఆఫ్‌చేసొచ్చి నావైపు తిరిగి కూచుంది. తెలుగు వారైనా గార్డెన్ సిటీ బెంగుళూరులో పుట్టిపెరిగిన ఊర్మిళకు మా అత్తమ్మ అన్నపూర్ణ గురించి తెలీదు. చెప్పాల్సిన బాధ్యత నామీదుంది. గతం దృశ్యాలు మెదడు పొరల్లో కదుల్తూంటే లుంగీ సర్దుకుని కాళ్లు సోఫాలోకి ముడుచుక్కూచున్నాను.

"ఆవిడ మా అన్నపూర్ణ అత్తమ్మ..."

"అత్తమ్మ... అంటే...మీ అక్కగారి అత్తయ్యనా?"

"కాదు. మా నాన్నకు తోడబుట్టి కూడా పెరిగిన చెల్లెలు."

"మరా ఫొటోకు దండవేసుందిగదా!"

"అవును... ఇప్పుడీ లోకములో లేదు."

"అయ్యో పాపం!" మొహం ఆశ్చర్యార్థకమైంది. "ఆవిడ గురించి పూర్తిగా చెప్పండి." బయట సూర్యప్రతాపం తన ఉనికిని తెలుపుకుంటోంది. లోపలి ఉక్కపోతను తట్టుకునేందుకు సీలింగ్ ఫ్యాను వేసొచ్చి సర్దుక్కూచున్నాను. "అడక్కుండానే అందాలన్నీ ఆడవాళ్ళకిచ్చే ఆ దేవుడు మా అత్తమ్మ విషయంలో పిసినారితనం చూపించాడు. నల్లని శరీర ఛాయ, ఎత్తుపళ్లు... అందరూ ఆవిడను అనకారి అనేవారు. ఆమె పెళ్లి ఓ సమస్యై కూచుందటా. ఎన్నో సంబంధాలు చూసారట. చివరగా ఓ వయసు మళ్లినాయనకు కట్టబెట్టారట. మా నాన్నది చిరుద్యోగం. అమ్మకు గుండెజబ్బు... కాబట్టి ఎప్పుడూ పేషెంట్‌గానే ఉండేది. ఇంటి పనులు, వంట పనులు అన్నీ అత్తమ్మనే చూసేది. మా అక్కయ్య, నేను ఆమె చేతుల్లోనే పెరిగాం. మమ్ముల్ని ఎత్తుకుని లాలిస్తూ, చందమామను చూపిస్తూ బువ్వ తినిపించేది. లాలి పాడి నిద్రబుచ్చేది. అందచందాలు లేకున్నా అధైర్యపడేది కాదు. బట్టలు కుడుతూ, బీడీలు చేస్తూ నాన్న సంపాదనకు వేన్నీళ్లకు చన్నీళ్లలా తోడ్పడేది. పొద్దున మేము నిద్రలేచినప్పటినుండి రాత్రికి నిద్రబోయేదాకా ఏదో పనిచేస్తూనే ఉండేది. మానవ సహజమైన అలసట ఆమెను లొంగదీసుకోలేదు. మా బడి ఫీజులు తానే కట్టేది. పుస్తకాలు కొనిచ్చేది. మాకు మార్కులు తక్కువ వస్తే బడికొచ్చి హెడ్మాస్టర్తో మాట్లాడి సబ్జెక్టు టీచర్లను మందలించి వెళ్లేది. సర్కారు జీతాలు తీసుకుంటున్నారు కాబట్టి చదువు సరిగా చెప్పాలని హితబోధ చేసేది. రోజూ తాను బీడీలు చేసుకుంటూ మాతో హోంవర్కు చేయించేది. పరీక్షలప్పుడు ఏవేవో పిండివంటలు చేసి కొసరి కొసరి వడ్డించేది. ఇంటిముందుకొచ్చిన బిచ్చగాళ్లను ఖాళీగా పంపించేది కాదు.

ఓ రోజు మా అమ్మ 'అన్నపూర్ణా! నేను, నా పిల్లలు నీ ఋణమెట్లా తీర్చుకోవాలో అర్థంకావడం లేదు' అన్నది. అన్నపూర్ణ అత్తమ్మ వెంటనే కొంగు నడుముకు బిగించుకుని 'అట్లంటావేంది వదినా? మీరు నాకు పరాయిలా? ఈ భూమ్మీది కొచ్చినప్పుడు ఏదో ఒకటి సాధించాలిగదా! నీ పిల్లల్ని నా పిల్లలే అనుకుంటున్నాను. తలచెడి పుట్టింటి కొచ్చిన నాకా దేవుడే నీ పిల్లలనిచ్చిండు. వాళ్లు పెరిగి ప్రయోజకులవుతే నా జన్మసార్థకమైందనుకుంటా. మరోసారి అట్లా మాట్లాడొద్దు వదినా!' అంటూ కంట తడిపెట్టింది. గుండె తడి నా గొంతుకు అడ్డుపడింది. పైనుండి సీలింగు ఫ్యాను గాలి మమ్మల్ని చల్లగా తడుముతోంది. అది కన్న తల్లి ఆప్యాయంగా వెన్ను నిమిరినట్టుంది. నావైపే తదేకంగా చూస్తున్న ఊర్మిళ తపోభంగమైనట్టు కదిలింది. "అయితే ఆవిడ సార్థకనామధేయురాలన్న మాట భయపడేది

కాదు. ఎప్పుడన్నా నాన్న 'ఊర్మిళా! నా కుటుంబంకోసం నీకెందుకిన్ని అవస్థలు?' అని అడిగితే అవస్థలు, సమస్యలు మనుషుల్ని భయపెట్టిస్తాయి. భయపడి పారిపోతే భంగపాటు తప్పదన్నయ్యా! బతికున్నన్ని రోజులు నలుగురికి మేలు చెయ్యడమే గదా నాకు మిగిలింది. తోడు పోగొట్టుకున్న నాకో నీడనిచ్చావు. నీడనిచ్చిన ఈ ఇల్లు చల్లగా ఉంటేనే నాకు తృప్తి' అని మనసు లోతుల్ని తట్టేలా జవాబిచ్చేది."

"నాదో అనుమానమండీ!" ఊర్మిళ జరిగి నాకు దగ్గరగా వస్తూంటే ఒంటిరాయి ముక్కుపుడక తళుక్కుమంది. "మీ అమ్మకెప్పుడూ వైద్యం నడుస్తుండేది గదా, మీ అత్తమ్మ అన్ని అవస్థలు పడుతూ వదినకు అంత మంచి సంబంధం చూసి ఎలా పెళ్ళిచెయ్య గలిగింది? మీ కాలేజీ చదువులకు ఫీజు లెట్లా భరించారు?". "అదిగూడా మా అత్తమ్మ మహిమనే." "అంటే... ఆమె దగ్గరేదన్నా మంత్రదండముండేదా?" నవ్వబోయి ఆపుకున్నాను. ఊర్మిళ పెదాలు విప్పుకోబోయి మూసుకున్నాయి. కాటుక కనురెప్పలు తుమ్మెద రెక్కల్లా టపటపలాడాయి. ఆ దృశ్యం ఆదిశంకరాచార్య విరచించిన సౌందర్య లహరిలోని అమ్మ వారి వర్ణనను గుర్తుకుతెచ్చింది.

"మంత్రదండం కాదు గాని మంత్రాంగం చేసేది. అక్కయ్యకు మంచి పెళ్ళిసంబంధం దొరికింది గాని కట్నం భరించలేనంత అడిగారు. ఆనాడు అన్నపూర్ణ అత్తమ్మ భర్త చనిపోగానే అత్తవారింటినుండి ఉట్టిచేతుల్తో వచ్చింది. అక్క పెళ్ళి సంబంధం కుదరగానే నాన్నను తీసుకుని వాళ్లత్తవారింటే కెళ్ళింది. అక్కడ పంచాయితీ పెట్టించింది. ఊరి పెద్దలను మెప్పించి, ఒప్పించి తన వంతుకొచ్చిన ఇల్లు, రెండెకరాల పొలాన్ని అమ్మేసి డబ్బులు తెకొచ్చింది. దాంతోనే అక్కయ్య పెళ్ళి ఘనంగా జరిగింది. నాకు ఎంసెట్లో రాంకు వచ్చినా ఫ్రీ సీటు దొరకలేదు. పేమెంట్ సీటుకోసం కావాల్సిన డబ్బుగూడా అత్తమ్మనే సర్దుబాటు చేసింది. అత్తమ్మ నాకు డబ్బు ఇచ్చేప్పుడు అక్కయ్యకేమనిపించిందో ఏమో! "అత్తమ్మా! తమ్మునికీ డబ్బు ఇచ్చింతర్వాత నీ దగ్గర ఏమీ మిగలదు. నీ భవిష్యత్తుకోసం ఏమీ ఉంచుకోవా?" అని అడిగింది. అత్త చిన్నగా నవ్వి 'పిచ్చిపిల్లా! నా భవిష్యత్తుకేం తక్కువుందనీ! నా అన్నయ్య పిల్లల్ని ప్రయోజకులుగా చెయ్యడమే నా భవిష్యత్తు. అది నా ఆశయంగూడా. అందుకోసమే ప్రయత్నిస్తున్నా"నని ఖరాఖండిగా చెప్పేసింది. అత్తమ్మ జవాబులకు మా మనసులు కరిగి నీరై కళ్లల్లో కదలాడాయి.

ఓసారి నా పుట్టినరోజునాడు...మా మిత్రుడు తన కెమెరాతో నన్ను, అమ్మానాన్నల్ని ఫొటోలు తీశాడు. నేను కుట్టుమిషన్ మీదున్న అత్తమ్మ దగ్గరికెళ్ళి 'అత్తమ్మ! నువు ఫొటో దిగాలి పదా. మేమంతా దిగాము. ఇహ నీ ఫొటో తీస్తే పనైపోతుంది' అంటూ చెయ్యిపట్టి

లేపి నుంచోబెట్టాను. "ఓరి వెర్రివాగన్నా! మొద్దుముఖానికి మోపెడు బాసిగాలన్నట్టు నా అనాకారి ఆకారానికి ఫోటో గూడాను" అని కూచుంది. "అట్లంటే ఎట్లా? ఆ దేవుడిచ్చినట్టు ఉంటుంది పదా!" మళ్లీ లేపబోయాను. ఆమె మొహాన్ని నల్లని మేఘాలు అలుముకున్నాయి. 'నా తలరాతనే బాగాలేదు. అంతా ఆ దేవుని లీల. నన్ను బలవంతం చెయ్యకురా! చేస్తే నన్ను చంపుకుతిన్నంత ఒట్టురా!' అని భీష్మించుక్కూచుంది. నాన్న కల్పించుకుని "అది అంతేరా! నోటి నుండి వచ్చిన మాటకు తిరుగులేదు. ఆ మొండి ఘటాన్ని వదిలెయ్‌రా!" అన్నాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు అత్తమ్మకు తెలీకుండా చాటునుండి నేనే ఆమె ఫోటో తీసి ప్రింట్ వేయించాను. దాన్ని నా పర్సులో దాచుకున్నాను.

నా చదువు పూర్తయి ఉద్యోగంలో చేరాక అత్తమ్మను ఏ పనీ చెయ్యనియ్యకుండా కూచోబెట్టాలనుకున్నాను. ఆశల ఆరాటాన్ని మోస్తూ చదువు ముగించాను. ఉద్యోగాన్వేషణలో పడ్డాను." ఊర్మిళ పెదాలు సిగ్గులు సింగారించుకుని వణికాయి. "ఆ ప్రయత్నంలోనేగదా తమరు మా బెంగుళూరు కొచ్చింది. అక్కడి బసవని గుడిలోనే మన మొదటి పరిచయం" అంది. "అవునవును. ఉద్యోగం వేటలోనే బెంగుళూరుకొచ్చాను. మీ ఇంటిపక్కనే గదా మా ఫ్రెండు ఇంట్లో ఉన్నాను. మన పరిచయం పరిణయంగా మారుతుందని ఊహించలేదుగదా! ఏదైతేనేం! బెంగుళూరు కంపెనీలో ఉద్యోగం దొరక్కపోయినా బంగారంలాంటి ఈ ముద్దులగుమ్మ సాంగత్యం లభించింది" చెంప గిల్లబోయాను. చెంపల్ని అరచేతుల్తో కప్పేసుకుని కొంచెం వెనక్కు జరిగింది. "ముందు మా పిన్ని.... అదే మీ అత్తమ్మ గురించి చెప్పండి." కళ్లను కమ్మగా తిప్పేసింది. "సరే." తిరిగి గతం అంచుల్లోకెళ్లిపోయాను. "బెంగుళూరు నుండి ఇంటికొచ్చేసరికి అత్త నురగలు కక్కుతూ మంచమ్మీద పడుంది. నెత్తికొట్టుకుంటూ ఏమైందని అడిగాను. 'అత్తను నాగుబాము కరిచిందిరా బాబూ!' అంటూ అమ్మ బోరుమంది. నాన్న గుండెలు బాదుకుంటూ "పొద్దున పూలమొక్కల చుట్టూ మొలిచిన కలుపుమొక్కల్ని తీసేస్తుందటా" అందుకున్నాడు. అది పెరట్లో ఉంది. మేము లోపలున్నాముగదా. నాగుబాము ఎక్కడినుంచి వచ్చిందో ఏమో అత్త అడుగు దానిమీద పడిందటా. కసిగా కాటేసి ఎటో పోయిందని అత్తనే చెప్పిందిరా! నా ఇంటి దీపం ఆరిపోతుందిరా!' బావురు మన్నాడు.

నాకు నడినెత్తిమీద కోడెనాగు పడ్డట్టనిపించింది. అత్త తలను నా ఒడిలోకి తీసుకుని 'అత్తా! ఆస్పత్రికి పోదాంపదా!' అన్నాను. అప్పటికే స్పృహ కోల్పోతున్న అత్తమ్మ.... వద్దురా.... ఆ భగవంతుడు.... న్నా.... నా కప్పజెప్పిన బాధ్యత.... అయిపోయింది న్నా.... నాగ... నాగదేవత నన్ను రమ్మంటుంది. అ... అమ్మ...ఔ...న్నా...నాన్న...." మాట

పూర్తికాకుండానే తల పక్కకు వాలిపోయింది. అత్తను భుజాలమీదేసుకుని ఆస్పత్రికెళ్లాను. ఆమె ప్రాణాలు అప్పటికే గాల్లో కలిసిపోయాయని డాక్టరు చెప్పిండు. బతికున్నన్ని రోజులు ఫొటో దిగేందుకిష్టపడని అత్తమ్మ ఫొటోను డెవలప్ చేయించి అక్కడ అలంకరించారు. నువు తీసిన ఫొటో మా అత్తమ్మదే ఊర్మిళా!".

బరువెక్కిన గుండెలతో రెండు నిమిషాలు మౌనముద్రలో గడిపాం. ఊర్మిళ కొన కొంగుతో కళ్లద్దుకుంది. మీకు మేనత్తంటే నాకు తల్లితో సమానం. మా పిన్ని త్యాగధనురాలు. ఆ త్యాగాన్ని మాటల్లో చెప్పలేం!" అంటూ లేచి వెళ్లి ఫొటో తీసుకొచ్చింది. దాన్ని నాకు చూపిస్తూ తానూ తదేకంగా చూస్తూ "మా పిన్ని అనాకారి కాదండి. అందాల దేవత" అంటూ కళ్లకద్దుకుంది. "ఈ ఫొటో జాగ్రత్తగా ఉంచు. ఈమెనే మన దేవత...". "థాంక్యూ....ఊర్మిళా!". "ఈ ఫొటోఫ్రేము పాతబడిపోయింది. గోల్డెన్ కలర్‌ఫ్రేం కొత్తది వేయిద్దాం. ఆ తర్వాతనే అక్కడ తగిలిద్దాం. రోజూ పూలదండ మారుద్దాం". ఫొటోను మరోసారి కళ్లకద్దుకుంది. ఎద పొదలోని సంతోష తరంగాలను అదిమిపెట్టి అంతేకాదు ఊర్మిళా. మనకు కూతురే పుట్టాలని దేవుని గుడికెళ్లి అర్చన చేయించి వద్దాం" కళ్లలోకి చూశాను. ఆ కళ్లలోకి చూశాను. ఆ కళ్లల్లో ఆనంద సింధూ తరంగాలు కదుల్తున్నాయి. "అం...టే... మా పిన్ని మళ్లీ మన ఒడిలోకి రావాలనీ, మనింట్లో పారాడాలనా?". "అవును. బజారు కెళ్దామన్నావుగదా! అట్నుంచటే గుడికెళ్లి వద్దాం పదా!" మురిపాల మూట విప్పాను.

*(ఆంధ్రభూమి, శనివారం, 7-5-2011)*

కథా నిలయం
శ్రీకాకుళం